కథ

# పుట్టలోని చెద

సి.వి.నరసింహదాసు



తూర్పున వెలుగురేకలు విచ్చుకుంటున్నాయి... రాత్రి నిండా ధాత్రిపై అలుముకున్న చీకటి పొరల్ని చీల్చుకుంటూ....

ప్రతి సూర్యోదయం ఎన్నో కొత్తఆశల్ని మోసుకొస్తుంది. .. కానీ.. నా జీవితంలో ఈ ఉదయం ఏమి తేనుంది? నిజానికి నేను ఆశిస్తున్నది ఏమి మిగిలుంది? మనసు బండబారిపోయిన మనిషికి ప్రకృతి ఏ చైతన్యాన్ని అందిస్తుంది? భవిష్యత్తుపై ఆసక్తి చచ్చిపోయిన వ్యక్తికి ఏ ఫలశ్రుతి పునరుజ్జీవితమౌతుంది?

చుట్టూచాలా ఎత్తయిన గోడలు... వాటిపై కరెంటు తీగెలు... ఆపై తుపాకుల కాపలా... అనుక్షణం నిశితంగా వెంటాడే ఖాకీ చూపులు....

అయినా.. వీటన్నిటినుండి మనిషి తప్పించుకోవచ్చు... కానీ... తన ఆలోచనల నుండి పారి పోగలడా... మనసుకు మత్తు చల్లగలడా?

ఎక్కడ మొదలైంది జీవితం?

ఎక్కడ ముగింపు చూడబోతోంది?

ఈ జనన మరణాల మధ్య ఆడే నాటకంలో ఎవరి పాత్ర వారే రచించుకుంటారు. వచ్చిన చిక్కల్లా యిక్కడే... ఆ రచనకి 'నేను మాత్రం' అనే అహం తోడైతే, కొందరు సహపాత్రధారులు ఆ తాకిడికి బలైపోతారు. తమ ప్రమేయం లేకుండానే.

పుట్టుకతో పూలపాన్పు జీవితం కాదు నాది... ఆకలితో అమ్మడొక్కలో ముడుచుకు పడుకున్న రోజులున్నాయి. పది రూపాయల అప్పుకోసం నాన్న చేయి పట్టుకుని పాతిక ముందిని ప్రాధేయపడిన గుర్తులున్నాయి.

మధ్య తరగతి శ్వాసించేది భవిష్యత్తు కోసం... జీవించేది రాబోయే మంచి రోజుల ఊహల్లోనే...

అందుకే.. తామెంత కష్టాలు పడినా, నా చదువుకు లోటు చేయలేదు అమ్మా, నాన్న...

నా డిగ్రీ చదువు నన్నో ఉత్తమ వ్యక్తిగా, సమా

జంలో బాధ్యత గల పౌరురాలిగా తీర్చిదిద్దినందుకు వారు గర్వపడని క్షణం లేదు.

ఇరవయ్యో ఏట నా పెళ్లి చంద్రశేఖరంతో అంతే నిరాడంబరంగా జరిగిపోయింది. అప్పటికి అతడో గుమస్తా... పర్మనెంటు కాని ఉద్యోగం...

వచ్చే రాబడితో మా సంసార నౌక సాఫీగానే సాగిపోయేది. మా జంట ''మేడ్ ఫర్ ఈచ్ అదర్''. సుఖాలు నంజుకుంటూ, కలిమిలేముల్ని పంచుకుంటూ, కట్టుబాట్లు పాటిస్తూ మా జీవితం గడచిపోతున్న వేళ, మమ్మల్ని వేధించే లోటు ఒక్కటే.. ''సంతానం''.

మొక్కని దైవం లేదు... చేయని వ్రతం లేదు. దర్శించని క్షేత్రం లేదు.. పరీక్షించని వైద్యం లేదు.

అమ్మదనంలోని కమ్మదనానికి స్త్రీ జన్మ సార్థకత పొందుతుంది. రక్తాన్ని పంచి, చనుబాలతో పెంచిన బిడ్డ తన గుండెలపై తంతుంటే మురిసిపోతుంది. బిడ్డ ప్రతి కదలికలో తన ప్రతి రూపాన్ని చూసుకుని పరవశించి పోతుంది.

నేనూ ఓ ఆడదాన్నే... అందుకే పిల్లల కోసం పరితపించి పోయాను.

నా భర్త 'ఓదార్పు' అయిన క్షణాల్లో అతడి బాహువుల్లో గువ్వలా ఒదిగిపోయాను.

కాలం కరుణించింది. నా నిరీక్షణ ఫలించింది. పెళ్లయిన పదేళ్లకి నా కడుపు పండింది.

పండంటి బిడ్డ... నా చిన్న కన్నయ్య... నా ఇంటి తేజం... నా కంటి వెలుగు... 'తేజస్వి' కొడుకుగా నన్ను కరుణించాడు.

ఈ మధ్యకాలంలో నా భర్త రాజకీయాలకి దగ్గరయ్యాడు. ఓ ఎమ్మెల్యేగారబ్బాయి అతడికి క్లాస్‌మేట్ కావడంతో, ఆ ప్రభావంతో తనూ పాలిటిక్స్‌లో చురుకుగా పాల్గొనడం ప్రారంభించాడు.

క్రమంగా ఓ గుర్తింపు, చుట్టూ అనుచరగణం పెరగడం అతడిని మరింత ఉత్తేజితుడ్ని చేసింది.

రాజకీయాల్లో మజా ఆస్వాదించడం ఆరంభమైంది. రాత్రనకా, పగలనకా కష్టపడ్డారు. ప్రజల్లో మమేకమైనారు. మిత్రులతో పాటు శత్రువులూ పెరిగారు. చాణక్యనీతుల్ని తొందరగానే ఒంట పట్టించుకున్నాడు చంద్రశేఖరం.

` ఫలితంగా మా హోదా పెరిగింది. కొత్త గౌరవాలు ఆపాదించబడ్డాయి. మా వారు ప్రజల మనిషి.... ద లీడర్...

అసలు రాజకీయాలే రుచించని నేను అతడికి చేసిన హితబోధలు చెవికి చేరలేదు. కాలంతో పాటు మనిషి కూడా మారిపోయారు.

అతడి జీవితంలో రాజకీయాలదే ప్రథమ స్థానం... అలాగని నన్ను, నా బిడ్డని నిర్లక్ష్యం చేసింది లేదు.

కానీ... నా వరకు ఆ మంచితనం సరిపోదు... రాజకీయం ఆర్తులైన ప్రజలకి మేలు చేయగలగాలి. వారిని దోచుకు తినడం కాదు..

నా హితబోధలు వినిపించుకునే స్థాయిని దాటిపోయాడు నా భర్త.

మా పెంకుటిల్లు భవంతిగా మారింది. చుట్టూ తోట... ఇంటి నిండా నౌకర్లు... కాలు బైట పెడితే కార్లు...

ఈ సౌభాగ్యం అంతా 'తేజస్వి' పుట్టుక మహిమేనని ఆయన గట్టి నమ్మకం... అందుకే కొడుకు పట్ల విపరీతమైన వాత్సల్యం...

తేజస్వి కోరితే కొండమీది కోతినైనా క్షణాల్లో తీసుకురావలసిందే.

అయితే... నా భయాలు నాకున్నాయి. అతిగారాబం వాడినెక్కడ పాడుచేస్తుందోనని ఆందోళన చెందే దాన్ని....

నేను చెప్పే రాముడు, బుద్ధుడు, గాంధీ, జీసస్ కథలు వాడిని సన్మార్గంలో నడిపిస్తాయని... ఆశ... తరతరాల మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు వాడిని 'మనిషి'గా నిలబెడతాయని ఆకాంక్ష.....

వాడి తప్పటడుగులకి మురిసిపోయినట్లే, తప్పటడుగులు వేస్తుంటే సరిదిద్దాను. కొన్నిసార్లు కఠినంగానే మందలించాను.

కానీ... వాడు తండ్రినే ఎక్కువ ఆరాధించాడు. ఫలితంగా అల్లరి, మంకుపట్టు పెరిగాయి.

నా ఆందోళనని ఆయన తేలిగ్గా కొట్టి పడేశారు.

''నా ఆనందానికి, ఐశ్వర్యానికి వారసుడు వాడు. టీనేజికి అల్లరే అందం... మనంపడ్డ కష్టాలు వాడు కలలో కూడా పడకూడదు. అందుకే.. వాడు అడక్కుండానే కారిచ్చాను. మిత్రులతో ఖర్చులకి డబ్బిచ్చాను... నా పరపతినుపయోగించి మెడిసిన్లో సీటు తెప్పించాను... ఈ నాటి ఆకతాయితనమంటూ ఏమన్నా వుంటే, అది కాలేజీ రోజుల వరకే... నువ్వేమీ వర్రీ కాకు...

అయితే తేజస్విది కేవలం ఆకతాయితనం మాత్రమే కాదని గమనిస్తూనే వున్నాను. డబ్బు తెచ్చిన విచ్చలవిడితనం, విశృంఖలత్వం... రాజకీయాల్లో ఉచ్ఛస్థితి వున్న తండ్రి హోదాతో వాడికి అహంకారం...

నా హితబోధలు వాడిలో నా పట్ల వెగటునే పెంచాయి. ఎప్పుడూ తప్పించుకు తిరిగే వాడు పార్టీలు, పిక్నిక్‌లంటూ దానికి తండ్రి ఆసరా...

నేను నిస్సహాయనైపోయానా? మెడిసిన్ థర్డ్ ఇయర్ చదువుతున్న కొడుకుని ఎలా దండించగలను? ఎమ్మెల్యేగా లక్షల ప్రజలకి ప్రతినిధియైన భర్తకి ఎలా అర్థమయ్యేలా చెప్పగలను?

సుమతీ శతకం లేని ''పుత్రోత్సాహం'' పద్యంలోలా తండ్రి ఆనందిస్తున్నాడు.. కానీ కొడుకు చెడిపోతున్నాడని తెలిసి కూడా... ఆ పద్యాన్నే తల్లికి కూడా అన్వయిస్తే... నేను కుమిలి పోతున్నాను... ఒక్కగానొక్క బిడ్డ ప్రవర్తన చూసి...

నా గుండె బ్రద్దలయ్యే రోజు రానే వచ్చింది. నా జీవితంలో చీకటి రోజు... వెలుగుపై ఆశని శాశ్వతంగా తుడిచేసిన రోజు.

న్యూస్ చానల్స్ అన్నీ నిరంతరంగా ప్రసారం చేసాయి. ఆ వార్తని... దృశ్యాల్ని ముక్కలు ముక్కలుగా చూపించాయి.

కాలేజీలు ఓపెన్ అయిన కొత్తలో యిలాంటి వార్తలు సర్వసాధారణమైపోయాయి.

వికృతత్వానికి పరాకాష్టగా చేరిన విద్యార్థుల అల్లరి... అభివృద్ధి కోసం ఉద్దేశింపబడిన సాంకేతిక ప్రగతి మనిషిలోని రాక్షసత్వానికి ఆజ్యం పోయడం దురదృష్టం.

శాడిజం కోరలు చాచి అమాయకుల్ని కబళిస్తోంది...

ఆ రాత్రి... పది గంటల వేళ... తన రూములో మిత్రులకి పార్టీ యిస్తున్నాడు తేజస్వి. అకేషన్ కేముంది... తలచుకుంటే ప్రతీది అకేషన్... తన గది వైపు నన్నెప్పుడు రానివ్వడు వాడు.

టీవీలో అస్పష్టంగా ప్రసారం చేసిన దృశ్యాలపై నాకెందుకో సందేహం.. వాడి గదికి వెళ్లాలనే నిర్ణయించుకున్నాను.

అక్కడ....

## బాలీవుడ్‌లో 'సాధిక' బిజీ...

'సుస్వాగతం'లో పవన్ కళ్యాణ్ పక్కన ఓ ప్రధాన పాత్రలో నటించిన సాధిక ఇప్పుడు బాలీవుడ్‌లో బిజీ అయిపోయింది. 'సుస్వాగతం' తరువాత తెలుగులో శ్రీకాంత్ సరసన 'హలో...ఐ లవ్ యు'లో నటించింది. ఈ రెండు చిత్రాలూ ఆమెకు పెద్దగా పేరు తేలేదు. తెలుగులో ఆమె అవకాశాలు పెద్దగా లేకపోయినా బాలీవుడ్‌లో మాత్రం తెగ బిజీ అయిపోయింది. హిందీలో తను చేస్తున్న రెండు సినిమాల గురించి సాధిక చెబుతూ...'రివాజ్ అండ్ ఫిర్', 'తోబా తోబా' రెండు చిత్రాలలో పాత్రలు నాకు పేరు తెచ్చేపెట్టేవే. ఇవి కాక మరో రెండు మూడు చిత్రాలలో నటించనున్నట్లు తెలిపింది. నేను తెలుగు పరిశ్రమను మరిచిపోలేదు. అవకాశం వస్తే తిరిగి తెలుగులో నటించడానికి సిద్ధంగా ఉన్నాను అంటూ వివరించింది. ఒకే రకమైన పాత్రలకే నేను పరిమితం కాదలచుకోలేదు. అన్ని రకాల పాత్రలను చేయాలనుకుంటున్నాను అంటూ వివరించింది.



నేను స్థాణువునైపోయాను... రక్తం గడ్డ కట్టిపోయిన భావన... మెదడులో అణువిస్ఫోటనం...

వాడు తన మొబైల్ ఫోన్ లోని వీడియో రికార్డింగ్‌ని టీవీలో ప్రదర్శిస్తున్నాడు.

ఆ దృశ్యంలో....

అక్కడ జరుగుతున్నది... రాగింగ్... హాస్టల్ గదిలా వుంది....

ఓ కాలేజి అమ్మాయి నిలబడి వుంది... చుట్టూ అరడజను మంది కుర్రాళ్లు... వాళ్లలో తేజస్వి కూడా...

ఆ అమ్మాయి కళ్ళలో లేడికూన భయం... అబ్బాయిల చూపుల్లో వేట సింహాల క్రౌర్యం...

కూన వణుకుతోంది.

సింహాల ఇంటర్వ్యూ... ప్రశ్నలు... ఓ అమ్మాయిని ఓ అబ్బాయి అడగరాని ప్రశ్నలు... చాలా సునాయాసంగా... అది వారికి ఆట.. ఆమె సిగ్గుతో కుచించుకుపోతోంది... నిస్సహాయంగా...

సహాధ్యాయులు తనకి తోబుట్టువులతో సమానం. రాగింగ్ సంస్కృతి పరిచయాలు పెంచుకుని, ప్రెషర్స్‌లో బెరుకు పోగొట్టడానికి అయితే, సీనియర్స్ అన్నయ్య, అక్కయ్య పాత్రలు కదా పోషించాల్సింది?

కానీ జరగుతున్నదేమిటి?

సున్నితమనస్కులైన జూనియర్లు అవమానం తట్టుకోలేక కాలేజి వదలి పారిపోవడమో, జీవితాన్నే త్యాగం చేయడమో ఎన్ని వార్తలుగా వినడం లేదు? వారి తల్లిదండ్రుల గర్భశోకానికి ఎవరు బాధ్యులు?

వీడియోలో సీను మారింది.

ఇప్పుడు ప్రాక్టికల్స్ అట....

''అమ్మా నాన్న ఆట తెలుసా?'' అడిగాడు తేజస్వి.

ఆమె భయంగా అడ్డంగా తల వూపింది.

''ఆ ఆట తెలీకుండా మెడిసిన్ చదవడానికెలా వచ్చావ్ పిల్లా... మీ అమ్మా నాన్నా ఆటలాడుకుంటుంటే ఎప్పుడూ చూడలేదా?'' అన్నాడొకడు.

అదేదో జోక్ లాగ భళ్ళున నవ్వారందరూ..

''ఫోనీ నువ్వో ఫోజు పెట్టి చూపించరా పాపకి'' అన్నాడు మరొకడు.

''మనం తీస్తున్న వీడియోలో బాగా రావాలి సుమా... మిస్సైన ఫ్రెండ్స్ అందరికీ ఎస్సెమ్మెస్ పంపాలి గదా''.

ఒకడు లేచాడు... పదిహేడేళ్ల ఈ ముగ్ధ దగ్గరికెళ్తుంటే ఆమె తెల్లగా పాలిపోయింది.

ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు వాడు... ముఖం దగ్గరికి ముఖం చేర్చాడు..

''కట్... కట్... ఒరే ఫూల్.... నువ్వాడుతున్నది లవ్వాటరా... పాపం పాపకసలే ఏమీ తెలీదు. అపార్థం చేసుకోదూ.... అసలైన అమ్మా నాన్నాట నేను చూపిస్తాను చూడు...'' తేజస్వి లేచాడు.

వాడి ముఖంలో క్రూరత్వం భయం గొలిపేదిగా వుంది....

''పిచ్చి తల్లీ... అరవ్వే... అరువు పారిపో అక్కడనుంచి...'' నా మనసు ఆక్రోశిస్తోంది.


కాని.. ఆ అమ్మాయి ఏ శక్తీ లేనట్లు నిశ్చేష్టగా నిలబడిపోయింది...

భయంకరమైన దృశ్యం... తేజస్వి ఆమె చున్నీ లాగేశాడు. కుడి చేతిని చాచి, ఆమె నడుం చుట్టూ వేసి, ఎడమ చేతిని ఆమె ఛాతీ మీద... పెదవులతో..,.. మెడ క్రింద....

నో ... అది రాగింగ్ కాదు... రాక్షసక్రీడ... డబ్బుతో, కామంతో కళ్ళు మూసుకుపోయిన పిచ్చి కుక్కల పైశాచిక కాండ... నేనిక చూడలేకపోయాను....

''తేజా...''

అది అరుపో... గర్జనో... దిక్కులు పిక్కటిల్లిపోయాయి... నా కళ్ళలో ఎరుపు రక్తవర్ణంలోకి మారింది.




నన్ను చూడగానే వాడి మిత్రులు అక్కడ నుండి జారిపోయారు.

తేజస్వి మాత్రం నిల్చున్నాడు... చిరాగ్గా చూస్తున్నాడు. ముఖంలో ఏ కోశాన కనపడని పశ్చాత్తాపం.

''నా గదిలోకి పర్మిషన్ లేకుండా ఎందుకొచ్చావ్'' అరుస్తున్నాడు.

''పర్మిషన్! కనడానికి ఆనాడు వాడి పర్మిషన్ తీసుకోలేదు. గోరు ముద్దలు తినిపించడానికి, బుడిబుడి అడుగులు నడిపించడానికి తీసుకోలేదు.... వాడి అవసరాలు తీర్చడానికి ఏనాడూ ఎదురు చూడలేదు పర్మిషన్ కోసం... ఈ రోజు వాడి వికృత రూపం చూడగలిగింది పర్మిషన్ లేకుండానే...''

కూతురుగా, సోదరిగా, తల్లిగా ఆడది మగవాడిని అభిమానిస్తూనే వుంది తరతరాలుగా... సంస్కృతితో భాగంగా, మానాభిమానాల్ని పవిత్రంగా తన పురుషుడి కోసం అర్పించుకుంటూనే వుంది.

రాగింగ్‌లో భాగంగా ఆ అమ్మాయికి జరిగిన అవమానం ఈ జాతి పవిత్రతపై జరిగింది... దానికి కారణమైంది... నా బిడ్డ... ఇది కేవలం ప్రారంభం మాత్రమే...

అమ్మ కన్నా ముందు నేను ఓ ఆడదాన్ని.... నాలో ఆవేశం కట్టలు తెంచుకుంది. నరకాసుర వధలో సత్యభామ, మహిషాసురమర్దనిలో దుర్గాదేవి నాలో ఆవహించారు.

పక్కనే వున్న హాకీస్టిక్ చేతిలోకి తీసుకుని...

ఒకే ఒక దెబ్బ...

ఎక్కడ తగిలిందో తెలీదు...

వాడు గిలగిలగాడాడో... గింజుకు చచ్చాడో...

పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాను.

కేసులు.... వాయిదాలు... కోర్టు తీర్పు....

ఫలితం.... జైలు శిక్ష....

జైల్లో ఇది తొలి ఉదయం...

ఒకప్పుడు 'అమ్మ' అనిపించుకోవడానికి తాపత్రయపడ్డాను.. ''విషనాగు'' ని కన్నానని తెల్సుకుని, మళ్లీ గొడ్రాలిగా మారిపోయాను.

నో రిగ్రెట్స్...

నా కథ చరిత్రలో నిలవక పోవచ్చు... రాగింగ్ దుష్ట సంస్కృతితో భాగస్వాములౌతున్న నేటి యువతరానికి, వారిని ప్రోత్సహిస్తున్న పెద్దలకి ఓ రెడ్ ఎలర్ట్‌గా మారి, ఏ కొందరిలో మార్పు వచ్చినా నా జన్మ ధన్యమైనట్లే....!

*

రచయిత చిరునామా
**సి.వి.ఎస్.దాస్,**
మేనేజింగ్ మార్కెటింగ్,
హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్,
కోల్‌కతా రీజనల్ ఆఫీస్, డైరెక్ట్ సేల్స్,
10, కామెస్కో స్ట్రీట్, 8వ ఫ్లోర్,
కోల్‌కతా – 700 017.